

8 మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది మండలాల్లో మంగళవారం 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.తవణంపల్లెలో 42.4, నగరిలో 41.9, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 41.5, శ్రీరంగరాజపురంలో 40.9, పూతలపట్టు, పులిచెర్ల, వెదురుకుప్పం మండలాల్లో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో 39.5, బంగారుపాళ్యం, గంగాధరనెల్లూరు మండలాల్లో 39.1, బైరెడ్డిపల్లె, చౌడేపల్లె, ఐరాల, నింద్ర, విజయపురం, యాదమరి, పాలసముద్రం, పెనుమూరు మండలాల్లో 38.8, కార్వేటినగరంలో 38.3, రొంపిచెర్లలో 38.1, సోమలలో 38.0, పలమనేరులో 37.9, సదుంలో 37.6, గుడుపల్లె, కుప్పం, శాంతిపురం, వి.కోట మండలాల్లో 36.4, పుంగనూరులో 36.3, రామకుప్పంలో 33.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.


కార్వేటినగరం మండలం తిరుమలకొండమాంబగారిపేట వద్ద రహదారిపై విరిగిపడ్డ చెట్టు కొమ్మలను తొలగిస్తున్న పోలీసులు

● పలు మండలాల్లో వర్షం

గడిచిన 24గంటల్లో పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. పులిచెర్లలో 35, కుప్పంలో 19.2, గుడుపల్లెలో 18.6 మిమీ వర్షం కురిసింది.బంగారుపాళ్యం మండలంలో గాలి బీభత్సానికి ఐదు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.విద్యుత్ సరఫరాకు కొంత అంతరాయం ఏర్పడింది.వెదురుకుప్పం మండలంలో మంగళవారం సాయంత్రం మోస్తరు వానతో వాతావరణం చల్లబడింది.ఎస్‌ఆర్‌పురం మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన కురిసింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నగరి మండల పరిధిలో మంగళవారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది.విద్యుత్ అంతరాయంతో గాఢాంధకారం నెలకొంది.


బంగారుపాళ్యం మండలం మొగిలీశ్వరపాళ్యం వద్ద గాలి బీభత్సానికి నేలకొరిగిన విద్యుత్ స్తంభం

గంగ జాతర్లకు వేడుకగా చాటింపు


వర్షం కురుస్తున్నా.. వేలూరు రోడ్డులో గెరిగ ఊరేగింపు


గంగమాంబకు ప్రత్యేక పూజలు


సప్తకన్నికల ఆలయం వద్ద గెరిగకు పూజలు చేస్తున్న సీకే లావణ్య, భక్తులు


కొడి స్తంభానికి పూజలు

చిత్తూరు కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని బజారువీధిలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న నడివీధి గంగ జాతరకు మంగళవారం రాత్రి వర్షంలోనే చాటింపు కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. జాతర వంశపారంపర్య ధర్మకర్తలు సీకే లావణ్య, హేమంత్ కుమార్‌లు ముందుగా గిరింపేట చెంగ్రాలయకొండలోని సప్తకన్నికల ఆలయంలో అమ్మవారి గెరిగకు పూజలు చేశారు. అక్కడి నుంచి గెరిగను ప్రదర్శనగా గంగినేని చెరువు శక్తిమారియమ్మ, పొన్నియమ్మ ఆలయాలకు తీసుకొచ్చి పూజలు చేశాక బజారువీధికి తీసుకొచ్చారు. అక్కడ ఉత్సవ నిర్వాహకులు భూమి పూజ చేసి.. జాతరను అధికారంగా ప్రారంభించారు. అలాగే కొంగారెడ్డిపల్లె, గిరింపేట, మురకంబట్టు, సంతపేట, గంగాసాగరం, ఎస్టేట్ తదితర ప్రాంతాల్లోనూ గంగజాతరకు చాటింపు వేశారు.

కుప్పం, మే 6 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరకు మంగళవారం చాటింపు వేశారు.ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భాలయం ఎదుట కొడిమాను నిలబెట్టి పసుపు కుంకుమలు పెట్టి కొడిగట్టి కర్పూర హారతులు ఇచ్చారు.మధ్యాహ్నం ఆలయం ఆవరణలో భక్తులు అమ్మవారికి పొంగళ్లు పోశారు. పసుపు కుంకుమలు పెట్టి, వేప మండలతో అలంకరించి, అంబళ్లతో నిండిన పాత్రలను నెత్తిమీద పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి తెచ్చి అమ్మవారికి సమర్పించారు. వీరితోపాటు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, గంగ జాతర ఉత్సవ కమిటీ ప్రథమ సభ్యుడు బీఎంకే.రవిచంద్రబాబు, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు ప్రత్యేకమైన కలశాలలో అంబళ్లను ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వచ్చి గంగమ్మకు సమర్పించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి గంగమ్మను, ఆపక్కనే గల ముత్తుమారెమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో అంబళ్లను నిర్వాహకులు భక్తులకు పోశారు.చాటింపు పూజల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత గంగమాంబ జాతర మహోత్సవాలకు పట్టణంలో చాటింపు చేశారు.14వ తేదీన వినాయక స్వామి ఉత్సవంతో ప్రారంభమయ్యే జాతర 21వ తేదీన అమ్మవారి విశ్వరూప సందర్శనతో పూర్తి కానుంది.



జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

అపోలోతో ఒప్పందంపై అర్ధగంట చర్చ

నిర్మాణాత్మకంగా సాగిన డీడీఆర్సీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రితో అపోలో సంస్థ కుదుర్చుకున్న ఎంవోయూ మేరకు నిర్వహణ జరుగుతోందో లేదో సమగ్ర అధ్యయనం చేయాలని ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని పలువురు సభ్యులు కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగు హాల్లో మంత్రి అధ్యక్షతన సుమారు మూడు గంటల పాటు జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం సాగింది. కన్వీనర్‌గా కలెక్టర్ సుమిత్‌కుమార్ , సభ్యులుగా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ హాజరయ్యారు.జడ్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భజలశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, హార్టికల్చర్, వైద్య, పరిశ్రమల శాఖలపై చర్చించారు.జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, డీఆర్వో మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో ఇటీవల తెలుగు మహిళా నాయకురాలు శ్రీదుర్గకు సరైన వైద్యం అందించకపోవడంతో ఆమె మృతి చెందారని, ఈ ఘటన తీవ్ర మనోవేదనకు గురి చేసిందని ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పారు. అక్కడ అపోలో తరఫున పనిచేస్తున్న ఒక ఫిజీషియన్ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఈ సంఘటన జరిగిందని ఆరోపించారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు అపోలో సంస్థ నడుచుకోవడం లేదని నిర్ణీత నిష్పత్తిలో స్పెషలిస్టు వైద్యులు లేరన్నారు. రూ.కోట్లను మందుల కొనుగోలుకు ప్రభుత్వం ఇస్తున్నా.. రోగులకు మాత్రం ఇక్కడ అవసరమైన మందుల్ని అపోలో అందించడం లేదని ఆరోపించారు. సోమవారం చిత్తూరుకు వచ్చిన రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు కూడా ఈ అంశంపై వాకబు చేశారన్నారు. ఈ విషయంగా సమగ్ర విచారణ నివేదిక కలెక్టర్‌కు అందించాలని కోరారు. ఈ విషయంగా సభలో సుమారు అరగంట చర్చ కొనసాగింది.

పుంగనూరుకు రూ.12 కోట్లు.. చిత్తూరుకు రూ.18 లక్షలు!

గత ప్రభుత్వ హయాంలో పుంగనూరు నియోజకవర్గానికి తాగునీటి పనులు, నిధుల కేటాయింపులో పక్షపాతం చూపారని ఎంపీ దగ్గుమళ్ల ఆరోపించారు. పుంగనూరు నియోజకవర్గానికి తాగునీటి పనుల కోసం రూ.12 కోట్ల పనులు మంజూరు చేసి, చిత్తూరుకు రూ.18 లక్షలు మాత్రమే కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. ఇకపై ఏకపక్షంగా కాకుండా అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధుల్ని కేటాయించాలన్నారు.

సీఎం దృష్టికి ఎస్పీ గైర్హాజరు

జిల్లాలో శాంతి భద్రతల సమస్య తీవ్రంగా ఉందని, ఈ అంశంపై కూలంకషంగా చర్చించేందుకు డీడీఆర్సీలో అజెండాగా చేర్చమని అధికారులకు సూచించానని ఎంపీ దగ్గుమళ్ల అన్నారు. కానీ, ఇలాంటి కీలక సమావేశానికి ఎస్పీ మణికంఠ గైర్హాజరు కావడం దారుణమని, దీన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు.

సీఎం దృష్టికి మామిడి రైతుల సమస్యలు

జిల్లాలోని మామిడి రైతుల సమస్యల గురించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు సభ్యులు తీర్మానించారు. గిట్టుబాటు ధర ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, ఈసారి అలా జరగకుండా మంచి ధర అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.యుద్ధాల కారణంగా జిల్లా నుంచి ఎగుమతి కావాల్సిన తోతాపురి గుజ్జు నిల్వలు విపరీతంగా పెరిగిపోయాయని ఎంపీ ప్రసాద రావు వివరించారు.అకాల వర్షాల కారణంగా నేలరాలిన మామిడితో తీవ్రంగా నష్టపోయిన రైతులకు కొంతైనా నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జగన్మోహన్ కోరారు.భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మామిడి విస్తీర్ణాన్ని తగ్గించేటట్లు చూడాలని, మామిడి బోర్డు, మ్యాంగో రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు కేంద్రంతో చర్చించి ఒప్పించాలని ఎంపీని ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు.

తిరుమల భక్తులకు మామిడి రసాల పంపిణీకి తీర్మానం

ఉద్యానశాఖ గురించి సభలో చర్చ సుదీర్ఘంగా సాగింది. మామిడి గుజ్జును రసాలుగా మార్చి టెట్రా ప్యాకెట్ల రూపంలో తిరుమలలో క్యూ కాంప్లెక్స్, నడక దారిలో వెళ్లే భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేలా టీటీడీ బోర్డును ఒప్పించాలని కోరుతూ సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది.

ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు తప్పనిసరి

పలమనేరు మండలం జగమర్ల నుంచి చంద్రగిరి మండలం ఐతేపల్లె వరకు ఉన్న జాతీయ రహదారిపై ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని,మధ్యలో పి.కొత్తకోట వద్ద హైవే ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే క్షతగాత్రులకు తక్షణ చికిత్స అందించి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. ప్రభుత్వం బడ్జెట్‌లో వైద్యానికి నిధులు అధికంగా కేటాయిస్తున్నా.. అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వైద్యులు డ్యూటీలు సరిగా చేయకపోవడంతో ఓపీల సంఖ్య తగ్గుముఖం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

కుప్పంలో అడుగంటిన భూగర్భజలాలు

కుప్పం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో భూగర్భజల మట్టం అడుగంటడంతో సమస్య తీవ్రంగా మారిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ సభలో వివరించారు. కుప్పం తర్వాత పలమనేరు రెండో స్థానంలో ఉందని, జిల్లావ్యాప్తంగా 17 మండలాల్లో భూగర్భజల మట్టాలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు.ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య పలు గ్రామాల్లో ఎక్కువగా ఉందని, పరిష్కారం కోసం నియోజకవర్గాల వారీగా నిధుల్ని సమానంగా కేటాయించాలన్నారు. గుడిపాలలో చెరువులు చాలావరకు ఆక్రమణకు గురయ్యాయని, పూడికతీత పనులు చేపట్టాలని కోరారు.

సాంబయ్యకండ్రిగ రోడ్డుకు మరమ్మతులు

చిత్తూరు నగరం కట్టమంచి నుంచి సాంబయ్యకండ్రిగ వరకు వున్న రోడ్డు చాలాకాలంగా అధ్వానంగా ఉందని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. దీంతో నగరంలోని రైల్వే ఓవర్‌బ్రిడ్జి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో బ్రిడ్జి పరిస్థితి ఆందోళనకరంగా మారుతోందన్నారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖలు సమన్వయం చేసుకుని సాంబయ్యకండ్రిగ రోడ్డును బాగు చేయాలని కోరారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు మాట్లాడుతూ చిత్తూరు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఆ రోడ్డును ఆర్‌అండ్‌బీకి మారిస్తే మరమ్మతులు చేయిస్తామన్నారు.గతంలో అనాలోచితంగా కొన్ని గ్రామీణ రహదారులను ఆర్‌అండ్‌బీకి అప్పగించి తప్పు చేశారని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఇప్పుడు ఆయా రోడ్ల మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ వద్ద నిధులు లేవని, మళ్లీ ఆయా రోడ్లను పంచాయతీరాజ్‌కు అప్పగించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు.

రెవెన్యూ రికార్డుల్లో సమస్యలు కోకొల్లలు

చిత్తశుద్ధితో పరిష్కరించాలన్న ఇన్‌ఛార్జి మంత్రి

చిత్తూరు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వ హయాంలో నాయకుల నిర్వాకం వల్ల జిల్లాలో రెవెన్యూ సమస్యలు కోకొల్లలుగా మిగిలాయని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి చెప్పారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి కష్టపడి పనిచేస్తున్నారని, అయితే రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. అధికారులకు చేతులు జోడించి చెబుతున్నా..... సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేస్తే బాగుంటుంది.గతంలో వలే ఈ ప్రభుత్వం ఉద్యోగులపై జులుం చేయదని చెప్పారు. మ్యుటేషన్, వెబ్‌ల్యాండింగ్, టైటిల్‌డీడ్ వంటి రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. డీడీఆర్సీ సమావేశం తరువాత మీడియాతో మంత్రి మాట్లాడారు.జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించేందుకు జిల్లా యంత్రాంగంతో కలిసి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని సూచించారు. తాగునీటి నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జడ్పీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో ఆయన కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులతో కొద్దిసేపు జిల్లా సమస్యలపై చర్చించారు.

నేడు సత్యవేడుకు లోకేశ్

సత్యవేడు, మే 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధ, గురువారాల్లో సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బుధవారం సాయంత్రం 3.40 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గాన 5.10 గంటలకు సత్యవేడుకు వస్తారు. వీఎంకే కల్యాణ మండపం ఎదురుగా ఏర్పాటు చేసిన శిబిరంలో జరిగే టీడీపీ సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. గతంలో పార్టీ చేపట్టిన భవిష్యత్తుకు గ్యారంటీ, సభ్యత్వ నమోదు తదితర కార్యక్రమాల నిర్వహణలో ముందు వరుసలో నిలిచిన టీడీపీ కార్యకర్తలను సన్మానిస్తారు. 6.30 నుంచి 8 గంటల వరకు నియోజకవర్గ నాయకులతో సమావేశం అవుతారు. రాత్రి సత్యవేడులోనే బస చేస్తారు. తిరిగి గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ప్రజా దర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 11 గంటలకు శ్రీసిటీకి చేరుకుంటారు. అక్కడ ఎల్‌జీ పరిశ్రమ భూమి పూజలో పాల్గొంటారు. రోడ్డు మార్గం ద్వారా 2.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్‌కు వెళతారు.

వరసిద్ధుడి అంతరాలయ దర్శనానికి సేవా టికెట్?

ఎంత ధర పెట్టాలన్న దానిపై దేవదాయశాఖ తర్జనభర్జన

ఐరాల(కాణిపాకం), మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో అంతరాలయ దర్శనానికి ప్రత్యేకత ఉంది. వరసిద్ధుడి దర్శనానికి రోజూ వేల సంఖ్యలో భక్తులు కాణిపాకం విచ్చేస్తుంటారు. వీరికి ఉచితం, రూ.100, రూ.150 దర్శనాలున్నాయి. అందరూ క్యూలైన్ల ద్వారా స్వామిని మహా మండపం నుంచి దర్శించుకుంటారు. ఆలయ పునర్నిర్మాణం జరిగాక నూతనంగా అంతరాలయ దర్శనాన్ని ఆలయాధికారులు.. దేవదాయశాఖ అనుమతితో ఏర్పాటు చేశారు. ఈ దర్శనానికి ఇప్పటివరకు ఎలాంటి టికెట్ లేదు. దర్శనానికి ఎక్కువగా ప్రముఖులకే అవకాశం కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతరాలయ దర్శనానికి సేవా టికెట్ అమలు చేయాలని దేవదాయశాఖ ఆలోచిస్తోంది. ధర ఎంత పెట్టాలన్న దానిపై తర్జనభర్జన పడుతోంది. ఒకవేళ సేవా టికెట్ అమల్లోకి వస్తే ఆలయ ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. భక్తులెవరైనా ఈ టికెట్ కొనుగోలు చేసి, స్వామిని దగ్గరగా చూసే అవకాశమూ లభిస్తుంది.

సర్వేయింగ్ కోర్సుపై ఉచిత శిక్షణ

చిత్తూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): సర్వేయింగ్, ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ కోర్సులపై నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐలో ఉచిత శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఆపై విద్యార్హత కల్గిన 18-35 ఏళ్లలోపున్నవారు అర్హులన్నారు. శిక్షణ పొందిన వారికి ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా సర్టిఫికెట్ ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 97047 62155 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

ఎర్రచందనం కేసులో జామీనుదారులకు జైలు శిక్ష

ఐరాల, మే 6 (ఆంధ్రజ్యోతి): ఐరాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఎర్రచందాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో నిందితులకు పీలేరుకు చెందిన నాగరాజు, అతడి తండ్రి సిద్ధయ్యలు జామీను ఇచ్చినట్లు ఎస్‌ఐ నరసింహులు మంగళవారం తెలిపారు. నిందితులు తిరుపతి స్పెషల్ కోర్టులో విచారణకు హాజరు కాలేదు. దీంతో జామీనుదారులకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానాను న్యాయమూర్తి జస్టిస్ నరసింహమూర్తి విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎంపీడీవోలుగా ఐదుగురికి పోస్టింగులు

చిత్తూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోలకు ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఐదుగురికి జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు మంగళవారం పోస్టింగులు ఇచ్చారు. ఎర్రావారిపాలెం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న మాలతిని కేవీబీపురం ఎంపీడీవోగా నియమించారు. అలాగే నాగలాపురంలోని వెంకటరత్నమ్మను బీఎన్‌కండ్రిగకు, రామకుప్పంలోని రాధాకృష్ణకు గుడుపల్లెకు, వెదురుకుప్పంలోని పురుషోత్తంకు అదే మండలానికి, అనకాపల్లెలో పనిచేస్తున్న శిరీషను గుడిపాల ఎంపీడీవోలుగా నియమించారు.



పద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభం



స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, మే6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలోని 'దశావతార-అష్ట లక్ష్మి' మండపంలో మంగళవారం సాయంత్రం పద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజైన మంగళవారం మలయప్పస్వామి గజవాహనంపై కొలువుదీరి ఉభయనాంచారులతో కలిసి మండపానికి ఊరేగింపుగా చేరుకున్నారు. వివిధ హంగులతో శోభిల్లుతున్న పెండ్లి మండపంలో నిత్య నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు, మాల పరివర్తనం, పూలబంతులాట, నూతన పట్టువస్త్రాల సమర్పణ కోలాహలంగా జరిగాయి. స్వామికి కొలువు నిర్వహించాక చతుర్వేద పారాయణం, మలహరి, దేశిక, సౌరాష్ట్ర, వారహి, కదన కుతూహల, నీలంబరి వంటి వివిధ రాగ-తాళ వాయిద్యాల నడుమ స్వామి వార్ల కల్యాణం జరిగింది. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించాక శ్రీదేవి, భూదేవి సహితుడైన స్వామి అశేష భక్త జనం మధ్య ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యురాలు పనబాక లక్ష్మి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాగా, పెండ్లి మండపాన్ని టన్ను పండ్లు, 2 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్‌తో దాదాపు 150 మంది గార్డెన్ సిబ్బంది, 50 మంది ఎలక్ట్రిక్ సిబ్బంది అలంకరించారు.

పెలికాన్ పక్షికి వడదెబ్బ



సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వద్ద ఓ ఇంటి సమీపంలో పెలికాన్ పక్షికి వడ దెబ్బ తగిలి పడిపోయింది. నెర్రికాలువ వద్ద సేదతీరున్న పెలికాన్ పక్షికి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ తగిలింది. స్థానికులు గమనించి వన్య ప్రాణి అధికారులకు సమాచారం ఇవ్వగా.. వారు పెలికాన్ పక్షికి పశువైద్య శాలలో వైద్య పరీక్షలు చేయించి కుదిరి చెరువులో విడిచిపెట్టారు. పెలికాన్‌ను రక్షించిని సిబ్బందిని డీఎఫ్‌వో హారిక, ఎఫ్ఆర్‌వో నరసింహారావు అభినందిచారు.

– సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

సత్యవేడు కొలిక్కి వస్తుందా?

● టీడీపీ కోటలో వర్గాలతో బీటలు ● నారా లోకేశ్ కొలిక్కి తెస్తారని శ్రేణుల్లో ఆశలు

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): యువనేత, మంత్రి నారా లోకేశ్ బుధవారం సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులతో సమావేశం అవుతుండడంతో ఇక్కడి రాజకీయాలపై జిల్లా అంతా ఆసక్తి నెలకొంది. టీడీపీకి తొలి నుంచీ బలమైన పట్టున్న నియోజకవర్గంలో వర్గవిభేదాలు తారస్థాయిలో ఉన్న సమయంలో లోకేశ్ ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీ సస్పెన్షన్ తొలగుతుందా? నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించబోతున్నారు? అనే అంశాలు చర్చగా మారిన నేపథ్యంలో లోకేశ్ అన్నీ చక్కదిద్దుతారనే ఆశాభావంతో ఆ పార్టీ శ్రేణులు ఉన్నాయి.

తొలినుంచీ నాయకత్వ సంక్షోభమే!

సత్యవేడు నియోజకవర్గం తొలి నుంచీ టీడీపీకి బాగా పట్టున్న ప్రాంతం. పార్టీ ఆవిర్భావం నుంచీ ఇప్పటి వరకూ పది సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు సార్లు టీడీపీ అభ్యర్థులు గెలిచారు. టీడీపీ నేతల నడుమ వర్గ విభేదాల కారణంగానే ఆ మూడు సార్లూ ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నియోజకవర్గంలో తొలినుంచీ టీడీపీకి నాయకత్వ సమస్య ఎదురవుతూనే వుంది. తొలి ఎన్నికల్లో పోటీ చేసిన తలారి మనోహర్ మొదలుకుని తర్వాత వచ్చిన సురాజ్, నారమల్లి శివప్రసాద్, హేమలత, తలారి ఆదిత్యతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వరకూ ఎవరూ బలంగా నిలదొక్కుకోలేకపోయారు. ఐదేళ్ళలోపే పార్టీ నుంచీ బలమైన వ్యతిరేకత ఎదుర్కొనడం, తదుపరి ఎన్నికల్లో టికెట్ కోల్పోవడం, నియోజకవర్గ ముఖచిత్రం నుంచీ తెరమరుగు కావడం జరుగుతోంది.



సత్యవేడులో లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఐదేళ్ళ నుంచీ దారీ తెన్నూ లేని పార్టీగా..

గత ఐదేళ్లూ సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ మరీ దారుణ పరిస్థితులను ఎదుర్కొంది. 2014 ఎన్నికల్లో గెలిచిన తలారి ఆదిత్యకు 2019లో టికెట్ దక్కలేదు. 2019 ఎన్నికల్లో పార్టీ టికెట్‌పై పోటీ చేసిన జేడీ రాజశేఖర్ ఓడిపోయారు. ఆ తర్వాత ఆయనకు ఇంఛార్జి పదవి దక్కలేదు. కొంత కాలం ఇంఛార్జి లేకుండా గడిచాక మాజీ ఎమ్మెల్యే హేమలతకు ఆ బాధ్యతలు అప్పగించారు. నెలల వ్యవధిలోనే ఆమెను తప్పించి ఆమె కుమార్తె డాక్టర్ హెలెన్‌కు ఇంఛార్జి ఇచ్చారు. దీంతో నియోజకవర్గంలో హేమలత (హెలెన్) వర్గం, జేడీ రాజశేఖర్ వర్గాలు ఏర్పడ్డాయి. తీరా 2024 ఎన్నికల్లో వీరిద్దరినీ పక్కన పెట్టి అధిష్ఠానం అధిష్ఠానం వైసీపీ నుంచీ వచ్చిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి టికెట్ ఇచ్చింది. ఆయన గెలుపునకు హేమలత, రాజశేఖర్ వర్గాలు పనిచేయలేదు. రాజశేఖర్ ఇండిపెంటెండ్‌గా పోటీ చేశారు. హేమలత వర్గం మరో ఇండిపెండెంట్ రమేష్‌కు మద్దతిచ్చింది. అయితే కోనేటి ఆదిమూలం ఇంతటి ప్రతికూలతను కూడా అధిగమించి పార్టీ సాను కూల ప్రభంజనం వల్ల ఎమ్మెల్యేగా గెలిచారు.

సస్పెన్షన్‌లోనే ఆదిమూలం

గెలిచినా కోనేటి ఆదిమూలం రాజకీయంగా స్థిరంగా అయితే లేరు. టీడీపీ వారికి కాకుండా వైసీపీ నుంచీ తన వెంట వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అధిష్ఠానానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనికితోడు ఓ మహిళతో వివాదం కారణంగా క్రిమినల్ కేసులో చిక్కుకుని పార్టీ ప్రతిష్ఠ దెబ్బతినడానికి కారకులయ్యారు. దీంతో పార్టీ నుంచీ ఆయన్ను సస్పెండ్ చేశారు. ఆ కేసు న్యాయస్థానంలో రాజీ చేసుకున్నప్పటికీ పార్టీ సస్పెన్షన్ మాత్రం ఇంకా తొలగలేదు. దీంతో ఏడు నెలలకుపైగా నియోజకవర్గంలో పార్టీకి దారీ తెన్నూ లేకుండా పోయింది. నాయకులు, కార్యకర్తలూ పెద్దగా ఎమ్మెల్యే దగ్గరకు వెళ్ళడం లేదు. గత ఎన్నికల సమయంలో పరిశీలకుడిగా ఉన్న చంద్రశేఖర్ నాయుడు ఓ వర్గ నేతగా ఎదిగారు. ఆయనకు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పదవి దక్కుతుందని అనుచరవర్గం ఆశిస్తోంది. మాజీ ఎమ్మెల్యే హేమలత అడపాదడపా వచ్చి వెళుతున్నారు. కొద్దోగొప్పో వర్గాన్ని కూడగట్టుకుని ఇంఛార్జి పదవిని ఆశిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి వంద రోజుల తర్వాత చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణకు కో ఆర్డినేటర్‌గా నియమితులైన శ్రీపతిబాబు కూడా ఒక వర్గాన్ని ఏర్పరుచుకుంటున్నారు. వీరిలో చంద్రశేఖర్ నాయుడు పక్షం రోజుల కిందట అభివృద్ధి పనులు ప్రారంభించడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. ఎస్సీ నియోజకవర్గం అని అలుసుగా తీసుకుంటున్నారని, ఇతర నియోజకవర్గాల్లో ఇలా చేయగలరా అంటూ బహిరంగంగానే విమర్శలు చేశారు. ఇలా నేతలు వర్గాలుగా విడిపోవడంతో- నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు పదవుల కోసం, పనుల కోసం ఎవరిని ఆశ్రయించాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. కాగా యువనేత నారా లోకేశ్ నేడు సత్యవేడుకు వచ్చి పార్టీ శ్రేణులతో సమావేశం కానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఆశాభావంతో వున్నాయి. ఎవరో ఒకరికి పార్టీ పగ్గాలు అప్పజెప్పి నియోజకవర్గంలో అభివృద్ధి జరిగేలా నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నారు.



చిన్నారితో మొక్కులు





సారె తీసుకొస్తున్న కైకాల వంశీయులు - అమ్మవారి వేషంలో..



మంగళవారం రాత్రి అవిలాల నుంచి సారె ఊరేగింపు

నవ్వుతున్నారు..నాయకా!

జాతర ఉత్సవ కమిటీలపై కూటమిలో కుమ్ములాటలు

ఒకటి కాదు, రెండు కాదు నాలుగు జాబితాలు విడుదల

(తిరుపతి, ఆంధ్రజ్యోతి)

తిరుపతి కూటమి నేతల్లోని అనైక్యతకు తిరుపతి గంగజాతర అద్దం పడుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గరవుతున్నా గంగమ్మ గుడికి పాలకమండలిని ప్రకటించలేకపోగా, జాతర నిర్వహణకు ఉద్దేశించిన ఉత్సవ కమిటీని కూడా ఏకాభిప్రాయంతో ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉన్నారు. మార్పులూ చేర్పులూ, అలకలూ కోపతాపాలతో జాతర చాటింపు మొదలైన మంగళవారం సాయంత్రానికి 23 మందితో కలెక్టర్ సంతకంతో ఒక జంబో కమిటీని ప్రకటించారు. మరోవైపు నాయకుల భేషజాలతో సంబంధం లేకుండా జాతర తంతు మాత్రం సంప్రదాయంగా మొదలైపోయింది. ప్రజలు భక్తితో సున్నపు బొట్లుతో, వేషాలతో, దుత్తలతో వచ్చి గంగమ్మను దర్శించుకుని వెళ్తున్నారు.

దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలకు పాలకమండలి లేకపోతే తాత్కాలికంగా ఉత్సవ కమిటీని నియమించి ఉత్సవాలు నిర్వహిస్తారు. గత 20 ఏళ్ల తిరుపతి జాతరలో మూడుసార్లకు పైగా స్థానికాలయాలకు ఇలాగే ఉత్సవ కమిటీలను నియమించారు. ఈ సంప్రదాయం ప్రకారం తిరుపతి గంగమ్మజాతరకు ఉత్సవకమిటీని ఏర్పాటు చేశారు. ఇదే కూటమి నేతల మధ్య అభిప్రాయ భేదాలకు కారణమైంది. కూటమిలోని ఇతర పార్టీల నేతలతో సంప్రదింపుల తర్వాత జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 27 మందితో ఒక జాబితాను తొలుత సిద్ధం చేశారు. ఇందులో సింహభాగం టీడీపీ కార్యకర్తలే ఉన్నారు. దానిని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ద్వారా రాష్ట్ర కమిషనర్‌కు పంపారు. అదేఫైనల్ అనుకుని అందులో పేర్లున్నవారు ఆ జాబితాను సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకుని శుభాకాంక్షలు అందుకుని సంబరపడ్డారు. ఇంతలో ఏం జరిగిందో ఏమోగాని నాలుగు రోజుల కిందట కలెక్టరేట్ నుంచి డీఆర్వో నరసింహులు పేరుతో 15 మందితో మరో జాబితా విడుదలైంది. ఇందులో తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలతో పాటు వివిధ నామినేటెడ్ పదవులు పొందిన కూటమి నేతలు, మాజీ ఛైర్మన్లు ఉన్నారు. దీనిపై కూటమి పార్టీల కార్యకర్తలు తీవ్రంగా అసంతృప్తి చెందారు. సోషల్ మీడియా వేదికగా సొంత పార్టీ నాయకులపైనే ఆగ్రహం వెళ్లగక్కారు. గంగమ్మ గుడిలో పదినిమిషాలు కూడా కూర్చోని వారిని ఉత్సవ కమిటీలో ఎలావేస్తారని ప్రశ్నించారు. ఇదిలావుంటే ఈ జాబితాలతో సంబంధంలేకుండా డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, నందగోపాల్ నాయుడుల పేరుతో డీఆర్వో మరో ప్రొసీడింగ్స్ ఇచ్చారు.

జాతర తుదికమిటీ సభ్యులు వీరే

గంగజాతర తుది కమిటీలో బాలసుబ్రమణ్యం రెడ్డి, మన్నెం శ్రీనివాసులు, ఆముదాల తులసీరాం,మహేష్ యాదవ్, ఆనంద యాదవ్, ఉమాశంకర్, జలపోతు చంద్రశేఖర్ రెడ్డి, శాంతి కుమారి, అశోక్, దేవరాజులు, నందగోపాల్ నాయుడు, విజయలక్ష్మి, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తమ్మినేని వెంకటేశ్వర్లు, హరిశంకర్, బాబ్జి, సుధాకర్, బుజ్జిబాబు, ఆనంద్, తమ్మిశెట్టి చంద్రశేఖర్, ఎన్వీ నరసింహ యాదవ్, ప్రభాకర్, సోము వేదవతి రాయల్ ఉన్నారు.

కలెక్టర్ సమీక్షతోనూ కొలిక్కిరాలేదు

అసంతృప్తులు, విమర్శల నేపథ్యంలో వివాదానికి తెరవేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ భావించారు. కూటమి ముఖ్యులను కూర్చోబెట్టుకుని సోమవారం కలెక్టరేట్‌లో జాతరపై సమీక్షిస్తూ తుదిజాబితాకోసం పని చేసేవారి పేర్లు ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. అడిగిందే తడవుగా ఎవరికివారు పెద్ద సంఖ్యలోనే పేర్లు ఇచ్చినట్టు తెలిసింది. ఈ సమయంలో ఇద్దరు నేతలు అలిగి వెళ్లిపోయారని సమాచారం. జాతర కమిటీ జాబితా మళ్లీ మొదటికి రావడంతో.. టీటీడీ బోర్డులోనూ ఇంత మంది ఉండరు కదా.. మీరే తేల్చుకుని జాబితా ఇవ్వండని కలెక్టర్ అన్నట్టు తెలిసింది. కమిటీ కోసం జాతర ఆగదు కదా. మంగళవారం మొదలైపోయింది. దీంతో మంగళవారం ఉదయం 10 గంటలకు 21 మంది పేర్లతో కలెక్టర్ పేరిట ఓ జాబితా విడుదలైంది. దానికి కూడా సంతృప్తి చెందని కూటమి నేతలు కలెక్టర్‌పై ఒత్తిడి చేసి మరో ఇద్దరి పేర్లను తగిలించుకున్నారు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో 23 మందితో కలెక్టర్ సంతకంతో మరో జాబితా వెలువడింది. ఏడాదికోసారి జరిగే జాతరనే కలిసి నిర్వహించుకోలేని స్థితిలో కూటమి నేతలు ఉంటే భవిష్యత్తు ఎలా ఉండబోతుందా అనే చర్చ ప్రజల్లో నడుస్తోంది.

వేషాల జాతర షురూ

● నేడు బైరాగి వేషం

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జాతరకు చాటింపు వేశారని తెలియగానే నగరంలోని యువతతో పాటు చిన్నపిల్లల్లో ఆనందం ఉరకలేస్తుంది. వారం రోజులపాటు వివిధ వేషాలతో సందడి చేయడానికి సిద్ధమయ్యారు. బుధవారం బైరాగి వేషంతో వేషాల జాతర మొదలవుతుంది. శరీరమంతా నామం కొమ్ము లేదా విభూతి పూసుకుంటారు. రేళ్ల కాయల మాలలు మెడలో ధరించి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. వేషంతో ఇంటి దగ్గర బయల్దేరినప్పటి నుంచి బూతులతో జనాలను భయపెట్టడం జాతర ఆచారం. ఇవిగాక పలువురు మహిళలు వేపాకు చీరలు కట్టుకుని, నెత్తిన వేయికళ్ల దుత్తలు పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.



గంగమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

జిల్లాలో పలుచోట్ల అకాల వర్షాలు

● కూలిన వృక్షాలు ● విద్యుత్తు తీగలు తెగి సరఫరాకు అంతరాయం

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల మంగళవారం సాయంత్రం అకాల వర్షాలు కురిశాయి. 4 గంటల వరకూ ఎండలు, ఉక్కపోతతో జనం సతమతమవగా.. ఆ తర్వాత వాతావరణంలో మార్పు కనిపించింది. వెంకటగిరి, శ్రీకాళహస్తి, ఏర్పేడు, పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, తిరుపతి రూరల్, డక్కిలి, బాలాయపల్లి తదితర మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఏర్పేడు మండలంలో గోడకూలి ఇద్దరు మృతిచెందారు. వెంకటగిరి అరగంట పాటు గాలీవానా బీభత్సం సృష్టించింది. వృక్షాలు కూలాయి. దుకాణాలపై రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శ్రీకాళహస్తిలో 6.20 నుంచీ 40 నిమిషాల పాటు హోరుగాలులతో పాటు పడిన వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పుత్తూరు పోలీస్ స్టేషన్, గేటు పుత్తూరు, నారాయణవనం రైల్వే గేటు తదితర చోట్ల విద్యుత్ తీగలు తెగిపోయాయి. కేఎం అగ్రహారం వద్ద విద్యుత్ స్తంభంపై రెండు చెట్లు కూలడంతో ఆయా ప్రాంతాల్లో సరఫరా ఆగిపోయింది. తిరుపతి రూరల్ మండలంలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గొల్లపల్లిలో సర్పంచ్ రవి కారుపై వేపచెట్టు కూలింది. తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో సైతం గాలులతో కూడిన వర్షం కురిసింది.



వెంకటగిరి పట్టణం రాణీపేట వద్ద ఓ దుకాణంపై తిరగబడిన రేకులు

రెండు చోట్ల గోడకూలి ఇద్దరి మృతి

● ఒకరికి గాయాలు

ఏర్పేడు, మే 6(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో మంగళవారం సాయంత్రం గాలివానకు గోడ కూలి ఇద్దరు మృతిచెందారు. చిందేపల్లి దళితవాడలో క్రికెట్ ఆడుతున్న పెద్దలు, పిల్లలు వర్షానికి తల దాచుకోవడానికి మైదానం సమీపంలోని రేకుల షెడ్‌లోకి వెళ్లారు. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం రావడంతో గోడ కూలగా, సోమిశెట్టి అంజనేయులు(19) అక్కడికక్కడే మృతి చెందగా కోటేశ్వర రావు(27) గాయపడ్డాడు. ఈయన్ను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అలాగే, వికృతమాలకు చెందిన ఎల్లప్పరెడ్డి(60) పొలం నుంచి వస్తుండగా ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో కోళ్ల ఫారం వద్దకు వెళ్లారు. అక్కడ గోడ కూలి ఎల్లప్పరెడ్డిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఎల్లప్పరెడ్డి (పాతచిత్రం)





గోడకూలడంతో మృతిచెందిన సోమిశెట్టి అంజనేయులు

ఎస్ఎస్ ఏపీసీగా గౌరీశంకర్‌రావు



తిరుపతి(విద్య), మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష విభాగం అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ జి.గౌరీశంకర్‌రావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన అనంతపురం- హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. డిప్యుటేషన్‌పై పాఠశాల విద్యాశాఖకు బదిలీచేస్తూ ఎస్ఎస్ ఏపీసీగా నియమించారు. ఈ మేరకు మంగళవారం సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటి వరకు డీఈవో కేవీఎన్ కుమార్ ఇన్‌చార్జిగా నిర్వహిస్తున్నారు. కాగా, శంకర్‌రావు గతంలో వరదయ్యపాళెం ఎమ్మార్వోగా పనిచేశారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు 611 మంది హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్ రాతపరీక్షలకు 611మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. కాగా జిల్లాలో మంగళవారం ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలకు మొత్తం 911మంది అభ్యర్థులకు గాను 611మంది హాజరయ్యారని, 300మంది గైర్హాజరయ్యారని వివరించారు.

కేరళ తరహాలో పర్యాటకాభివృద్ధి

● జిల్లాలో మెండుగా అవకాశాలు

ఉన్నాయన్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): కేరళ తరహాలో జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి జోనల్ ఇన్‌చార్జి కృష్ణబాబు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేరళ తరహాలో మెడికల్, హోటల్, స్పిరిచ్యువల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. రాష్ట్రంలో స్థూల జాతీయోత్పత్తిలో జిల్లా 3వ స్థానంలో ఉందని, మొదటి స్థానంలోకి వచ్చేలా అన్ని శాఖల అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లాలో పెట్టుబడులకున్న అవకాశాల గురించి పారిశ్రామికవేత్తలకు వివరించాలన్నారు. పరిశ్రమలకు అనుగుణంగా అధునాతన నైపుణ్య శిక్షణ మ్యాన్‌పవర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంటసాగులో అధునాతన పద్ధతులను పాటించేలా రైతులకు అవగాహన పెంపొందించాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, కమిషనర్ మౌర్య, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాశ్‌రెడ్డి, కిరణ్మయి, డీపీవో సుశీలా దేవి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

పంటపొలాలపై ఏనుగుల దాడి

పాకాల, మే 6 (ఆంధ్రజ్యోతి): పదిపుట్లబైలు పంచాయతీ గుండ్లగుట్టపల్లె సమీపంలోని పంటపొలాలపై సోమవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. పంటలను ధ్వంసం చేశాయి. రైతు డి.సరోజమ్మకు చెందిన టమోట పంటను తొక్కివేసి తీవ్ర నష్టం కలిగించాయి. మండల ఉద్యాన అధికారి శైలజ నష్టపోయిన పంటలను పరిశీలించారు.



ఏనుగులు ధ్వంసం చేసిన టమోట పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ



బ్యాటరీ సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు

చిత్తూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు పరిధిలోని 18 మంది దివ్యాంగులకు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.6.30 లక్షలతో కొనుగోలు చేసిన బ్యాటరీ ఆపరేటెడ్ సైకిళ్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశం తర్వాత ఈ కార్యక్రమం జరిగింది. చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీ మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై సదస్సు

చిత్తూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై మంగళవారం జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో ఎస్‌హెచ్‌వోలకు అవగాహన సదస్సు జరిగింది. ఆధారాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్పీ మణికంఠ వివరించారు. జిల్లాలోని అధికారులు, సైంటిఫిక్ అసిస్టెంట్లు బలరామకృష్ణ, శ్రీరాములురెడ్డి, ఉమామహేశ్వరి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కబేళాలకు తరలిస్తున్న పశువులకు విముక్తి



కబేళాలకు తరలిస్తున్న పశువులు

కల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కబేళాలకు పశువులను వాహనంలో తరలిస్తుండగా మంగళవారం పులిచెర్ల మండలం కల్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. కల్లూరు నుంచి సదుంకు వెళ్లే మార్గంలోని సినిమా థియేటర్ వద్ద మంగళవారం ఉదయం అనుమానంగా వాహనం చుట్టూ పట్టకట్టుకొని వెళుతున్న ఓ వాహనాన్ని కల్లూరు పోలీసులు గుర్తించి తనిఖీ చేశారు. వాహనంలోని 5 పశువులను గుర్తించి విచారించగా పెనుమూరు మండలంలో పశువులను కొనుగోలు చేసి పుంగనూరులో తమిళనాడుకు చెందిన గుర్తు తెలియని వ్యక్తులకు కబేళాలకు అమ్ముతున్నట్లు విచారణలో తేల్చారు. దీంతో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి పశువులను తిరుపతి గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెద్దపంజాణి మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కేటాయించిన పెద్దపంజాణి మద్యం దుకాణానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) విజయ్ శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌండ్ల ఉపకులానికి ఈ దుకాణాన్ని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్‌లో లేదంటే ఆఫ్‌లైన్‌లో సమీపంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. దరఖాస్తుదారుడు తప్పనిసరిగా గౌండ్ల ఉపకులానికి చెందిన జిల్లా వాసి అయి ఉండాలని పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ ద్వారా కలెక్టర్ దుకాణాన్ని కేటాయిస్తారన్నారు.

విద్యుదాఘాతంతో ఎక్స్‌కవేటర్ డ్రైవర్ మృతి



మృతిచెందిన మణి

పుంగనూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలకు నీరు పడుతూ ప్రమాదవశాత్తు మంగళవారం ఎక్స్‌కవేటర్ డ్రైవర్ మృతిచెందిన సంఘటన పుంగనూరు సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... బైరెడ్డిపల్లె మండలం గంగినేపల్లె కొత్తఇండ్లుకు చెందిన గోవిందు కుమారుడు మణి పదేళ్ల క్రితం పుంగనూరుకు చెందిన మమతను వివాహం చేసుకున్నాడు. పెళ్లి అనంతరం మణి (32) పుంగనూరు వద్ద రాంపల్లెలో ఉంటూ ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాంపల్లెలో సొంత ఇంటి నిర్మాణం చేస్తూ మోటారు నుంచి గోడలకు నీరు పడుతుండగా విద్యుదాఘాతానికి గురై నీటి సంపులో పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు సంపులోనుంచి బయటకు తీసి పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ సుబ్బరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లుగా అయూబ్‌ఖాన్, గురవయ్య

తిరుపతి(ఆటోనగర్) మే6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఎస్పీడీసీఎల్) డైరెక్టర్లుగా పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్యలను నియమిస్తూ ప్రభుత్వ ఇంధనశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 30న పదవీ విరమణ చేసిన అయూబ్ ఖాన్‌ను ప్రాజెక్టుల డైరెక్టర్‌గా, గత ఏడాది మే31న పదవీ విరమణ చేసిన కె.గురవయ్యను టెక్నికల్ డైరెక్టర్‌గా నియమించారు.

స్కిల్ ఆఫ్ చిత్తూరు.. రైతుల్లో చైతన్యం..!





తవణంపల్లె మండలం పుణ్యసముద్రంలో రైతులకు శిక్షణ - సోమల మండలంలో స్మార్టు ఫోన్ చూపుతున్న రైతులు

చిత్తూరు సెంట్రల్, మే 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై రైతులకు సాంకేతికపరంగా అవసరమైన సహాయ, సహకారాలు అందించడం, స్మార్ట్ ఫోన్ల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై పరిజ్ఞానాన్ని పెంచడం స్కిల్ ఆఫ్ చిత్తూరు కార్యక్రమ ఉద్దేశం. విత్తనం నాటినప్పటి నుంచి చేతికి వచ్చిన పంట విక్రయం దాకా, వాతావరణం నుంచి మార్కెట్ ధరల దాకా స్మార్ట్ ఫోన్ ద్వారా రైతులు తెలుసుకునేలా శిక్షణ ఇస్తారు. వివిధ రకాల యాప్‌ల వినియోగంతో వ్యవసాయ ఉత్పత్తులను దళారులపై ఆధారపడకుండా నేరుగా రైతులు అమ్ముకునే పరిజ్ఞానాన్ని నింపాలనే ఉద్దేశంతో కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేకంగా రూపొందించిన విధానం (రైతుల చేతుల్లో డిజిటల్ శక్తి)స్కిల్ ఆఫ్ చిత్తూరు.రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరు జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి అమలు చేస్తున్నారు. తొలి దశలో మార్చి 7 నుంచి 15వ తేదీ వరకూ 27 శిక్షణ తరగతుల ద్వారా 8 మంది మాస్టర్ ట్రైనీలతో 344 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు.తవణంపల్లె, యాదమరి, గంగవరం, కార్వేటినగరం, పూతలపట్టు, చౌడేపల్లె, సోమల మండలాల్లో రెండో దశ మొదలైంది. ఈనెల 21వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 502 రైతు సేవా కేంద్రాల ద్వారా 75 మంది మాస్టర్ ట్రైనీలతో 15,060 రైతులకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ నిర్దేశించారు.ఈ కార్యక్రమానికి అవసరమైన నిధులు ప్రత్యేక గ్రాంట్స్ నుంచి సమీకరించారు.

స్మార్ట్ ఫోన్‌పై శిక్షణతో..

యూపీఐ యాప్ ద్వారా డబ్బులు పంపడం, అందుకోవడం, మార్కెట్ ధరలు తెలుసుకోవడం, వాతావరణం, పంట సమాచారం, యాప్, యూట్యూబ్ ద్వారా వ్యవసాయ సంబంధిత విషయాలు తెలుసుకోవడం, ప్రభుత్వ విధానాలు, కల్పించే ప్రయోజనాలు తెలుసుకోవచ్చు. డిజిటల్ వ్యవసాయ యాప్‌ల వివరాలు, అగ్రి సెంటర్, వ్యవసాయ ఉపకరణాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతిక యంత్రాలు, స్మార్ట్ ఫార్మింగ్, టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, నూతన సాగు వంగడాలు, సాగు పద్ధతుల గురించి క్షుణ్ణంగా తెలుసుకునే వీలుంది.

సాగు వివరాలిలా..

జిల్లాలో మొత్తం 3,26,788 ఎకరాలు సాగులో ఉండగా, అందులో 1,69,500 ఎకరాల్లో ఆహార పంటలు పండిస్తున్నారు. ఉద్యాన పంటల సాగు 1,45,335 ఎకరాల్లో, పట్టు పరిశ్రమ సాగు 11,892 ఎకరాల్లో జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 1,57,575 మంది రైతులు 502 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రస్తుతం సేవలు పొందుతున్నారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికలు 18లోపు పూర్తిచేయండి

● మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

చిత్తూరు సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలను ఈనెల 18వ తేదీలోపు పూర్తిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం చిత్తూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి, అనుబంధ విభాగాల కమిటీల ఎన్నికలు పూర్తి చేయాలని చెప్పారు. ఈనెల కడపలో నిర్వహించనున్న మహానాడు సభకు కమిటీల సభ్యులందరూ హాజరయ్యేలా చూసి.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయడంపై పరిశీలించి.. చర్యలు తీసుకుంటామని అన్నారు. టీడీపీ హయాంలో చేసిన ఉపాధి హామీ, నీరు చెట్టు పథకాల పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులతోపాటు గోకులం షెడ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు కూడా త్వరగా చెల్లించేలా చూస్తామన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతో విడివిడిగా సమావేశం నిర్వహించి.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి పార్టీల నేతలు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు. అనంతరం కట్టమంచి చెరువును పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్, భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, మాజీ ఎంపీ దుర్గ, నేతలు చెన్నకేశవులు నాయుడు, సురేంద్ర కుమార్, చంద్రప్రకాష్, కాజూరు బాలాజి, వసంత్ కుమార్, మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



భక్తుల సమక్షంలో విశ్వరూప స్థూపానికి వడిబాల కడుతూ..

తిరుపతి గంగమ్మకు వడిబాల

● విశ్వరూప స్థూపానికి విశేషాభిషేకం

● జాతరకు చాటు వేసిన కైకాలవాళ్లు



వజ్రకిరీటంలో మెరిసిపోతున్న గంగమ్మ

తిరుపతి, మే 6(ఆంధ్రజ్యోతి):తిరుపతి గంగమ్మ వడిబాల కట్టుకుంది. దీంతో జాతర సంబరాలకు, వేషాల సందడికి తిరుపతి సిద్ధమైంది. మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని విశ్వరూప స్థూపానికి పరిమళ, పవిత్ర జలాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. పసుపు, కుంకుమ, నారికేళ, పాలు, పంచామృతం వంటి సుగంధద్రవ్యాలతో అమ్మవారి స్థూపానికి జరిగిన అభిషేకాన్ని వీక్షించిన భక్తజనం పారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను సైతం అభిషేకించి, వజ్రకిరీటధారణతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

అవిలాల నుంచి ఐదు ఆలయాలకు సారె

తాతయ్యగుంట గంగమ్మ, తాళ్లపాక పెద గంగమ్మ, అంకాళమ్మ, ముత్యాలమ్మ ఆలయాలకు అవిలాలనుంచి సారె అందింది. 'ఇందు మూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియచేయడం ఏమనగా...నేటి నుంచి తిరుపతి గంగ జాతర మొదలైందహో..! అంటూ తిరుపతి గంగజాతరకు మంగళవారం రాత్రి కైకాల కులస్థులు చాటింపు వేశారు.గంగమ్మ జన్మస్థలమైన తిరుపతి రూరల్ మండలం అవిలాలలో జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం అవిలాల గ్రామ పెద్దలు పూజలు నిర్వహించి పుట్టింట సారెను తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈవో జయకుమార్‌కు అందించారు. అక్కడినుంచి ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి సారె తీసుకొచ్చారు. దీని వెంబడే స్థానిక కైకాల వారు నగర పొలిమేర్లలో చాటింపు వేశారు. జాతర పూర్తయ్యేంత వరకు నగరంలో నివసించేవారు బయటఊర్లకు వెళ్లి నిద్రించకూడదనేది చాటింపు అర్థమని పెద్దలు చెబుతుంటారు.

బైక్ నెమ్మదిగా నడపమన్నందుకు మహిళలపై దాడి





మహిళలపై దాడి చేస్తున్న యువకులు - పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

వి.కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలోని జైభీంనగర్‌లో బైక్ నెమ్మదిగా నడపమన్నందుకు ఇద్దరు యువకులు మహిళలపై దాడికి దిగి వీరంగం సృష్టించారు. మంగళవారం సాయంత్రం ఇళ్లఎదుట మహిళలందరూ ఉండగా అదే వీధికి చెందిన మసూద్ స్నేహితుడితో కలిసి బైక్‌ను అతివేగంగా నడుపుతూ వచ్చారు. చిన్న పిల్లలు, మహిళలు ఉన్నారని.. కాస్త నెమ్మదిగా వెళ్లాలని మహిళలు సూచించారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆ ఇద్దరు యువకులు మహిళలపై దాడికి పాల్పడ్డారు. అడ్డొచ్చిన వారిని చితకబాదారు. దాడిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న పిల్లలనూ కొట్టారు. తమ జోలికొస్తే తలలు తెగుతాయంటూ హెచ్చరించారు. భయాందోళనకు గురైన బాధితులు ఇళ్లల్లోకి వెళ్లి దాక్కున్నా.. తలుపులు తన్నుకుంటూ వెళ్లి ఇంట్లో చొరబడి దాడికి తెగబడ్డారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడిలో సరోజమ్మ, చరణ్‌తోపాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. బాధితురాలు సరోజమ్మ, కుటుంబ సభ్యులు సీఐ సోమశేఖర్‌కు తమకు ప్రాణహాని ఉందని .. పలుమార్లు దాడులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జైభీంనగర్‌లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

మామిడి ఎగుమతి కేంద్రం పరిశీలన

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు మార్కెట్‌యార్డులోని వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ కేంద్రాన్ని రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు పరిశీలించారు.

నిరుపయోగంగా పాఠశాల భవనాలు..!

● పలు గ్రామాల్లో మూతపడిన బడులు

● రూ.కోట్ల ప్రజాధనం వృథా

● పట్టించుకోని అధికారులు, నాయకులు



పలమనేరు మండలం బొమ్మిదొడ్డి గ్రామంలో వృథాగా ఉన్న పాఠశాల భవనాలు

పలమనేరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలక్ష్యం కారణంగా పలమనేరు మండలంలో రూ.కోట్ల ప్రజాధనంతో నిర్మించిన పాఠశాల భవనాలు నిరుపయోగంగా మారాయి. ఆరేళ్ల క్రితం పాఠశాలల రేషనలైజేషన్‌తో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న నెపంతో మండలంలోని బొమ్మిదొడ్డి, జంగాలపల్లి, పకీరుపల్లి, బేరుపల్లి, రామాపురం, వెంకటేషపురం గ్రామాల్లోని పాఠశాలలను మూసివేశారు. ఆయా పాఠశాలల విద్యార్థులను పక్క గ్రామాల్లోని పాఠశాలలకు పంపించి అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయ పోస్టులు సైతం రద్దు కావడంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను మండలంలో అవసరమున్న పాఠశాలలకు బదిలీ చేశారు. అయితే ఈ గ్రామాల్లో లక్షలాది రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాలు వృథాగా వదిలేశారు. వీటి గురించి గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం మండలంలో పలు గ్రామ, వార్డు సచివాలయాలు, అర్బన్, రూరల్ హెల్త్ క్లినిక్‌లు, రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వాటికి పలుచోట్ల నూతన భవనాలు నిర్మించింది. భవనాలు లేని చోట అద్దె భవనాలు తీసుకొంది. అయితే ఈ వృథాగా ఉన్న భవనాల పట్ల మండల స్థాయి అధికారులు సైతం పట్టించుకోక పోవడంతో నేటికీ వృథాగా ఉన్నాయి. పాఠశాల ఆవరణాలు చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారాయి. చుట్టూ పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. కేవలం పలమనేరు మండలంలోనే కాకుండా నియోజకవర్గంలోని గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట, పెద్దపంజాణి మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో దాదాపు 200లకు పైగా పాఠశాల భవనాలు వృథాగా ఉన్నట్లు సమాచారం. ఇకనైనా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.







జంగాలపల్లిలో నిరుపయోగంగా పాఠశాల భవనాలు - పకీరుపల్లిలో...

పలమనేరు
కుప్పం/పుంగనూరు

స్వర్ణ కుప్పం సాధనకు సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

శాంతిపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ కుప్పం సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కడా పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం శాంతిపురం మండల సచివాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు స్వర్ణ కుప్పంగా మార్చాలన్న సంకల్పంతో ఉన్నారని, అందుకు అనుగుణంగా నియోజకవర్గంలోని ప్రతిఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అలాగే కుప్పం పార్టీ కార్యాలయంలలో ఏర్పాటు చేసిన జననాయకుడు కార్యక్రమంలో వచ్చే అర్జీలను తక్షణం పరిష్కరించాలని కోరారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారాం, మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, నాయకులు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు, శ్యామల, నుగు ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కోరిన చల్లా బాబు, పులిచెర్ల నాయకులు


మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి, పులిచెర్ల టీడీపీ నాయకులు

కల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా బాబు, పులిచెర్ల నాయకులు కోరారు. రాయచోటి నుంచి చిత్తూరులోని సమావేశానికి వెళుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి వద్ద మంగళవారం చల్లాబాబుతో కలిసి నాయకులు కలిశారు. జూనియర్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేస్తే కళాశాలకు ఉచితంగా స్థలం, భవనాల నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తానని కల్లూరుకి చెందిన ప్రవాసాంధ్రుడు పుట్టా సూర్యనారాయణశెట్టి హామీ ఇచ్చినట్లు వారి కుటుంబానికి చెందిన టీడీపీ నాయకుడు పుట్టా అనిల్‌కుమార్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కల్లూరు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 500 మందికిపైగా బయట ప్రాంతాలకు వెళుతుంటారన్నారు. ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. త్వరలో సీఎం చంద్రబాబునాయుడును కలిసి జూనియర్ కళాశాల మంజూరుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు మురళీధర్, ఉయ్యాల రమణ, ముల్లంగి వెంకటరమణ, కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, రమేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంనాయుడు, కరుణాకర్‌నాయుడు, మహేష్, రమేష్, ముద్దుస్వామినాయుడు, ఖాదర్‌వల్లి, సురేష్, బాబు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

పుంగనూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు టీచర్స్‌కాలనీలోని షిర్డిసాయి బాబా మందిరంలో సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా గత నెల 27 నుంచి పిల్లలకు నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల మంగళవారం ర్యాలీతో ముగిసింది. సత్యసాయిసేవా సంస్థల ఆధ్వర్యంలో ఆరేళ్ల నుంచి 12 ఏళ్లలోపు వయసున్న పిల్లల్లో క్రమశిక్షణ, విలువలు పెంపు కోసం బాలవికాస్ ఉచిత వేసవి శిక్షణ తరగతులు సంయుక్త సమన్వయకర్త హేమలత నిర్వహించారు. ఈ సందర్భంగా షిర్డిసాయి ట్రస్టు కన్వీనర్ త్రిమూర్తిరెడ్డి మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని కోరారు. సమన్వయకర్త హేమలత మాట్లాడుతూ పిల్లలకు ప్రధానంగా వేదం, ధ్యానం, యోగ, విలువలతో కూడిన ప్రార్థనలు, కథలు, గేయాలు, ఆటలు, కాలం నిర్వహణ, మంచి, చెడు అలవాట్లు, సేవ, రామాయణంలోని విలువలు, కోపం, కోరికలు అదుపులో ఉంచడం, ఆచారాలు అంతరార్థం, పరిశుభ్రత ప్రాముఖ్యత అంశాలపై శిక్షణ తరగతుల్లో వివరించామన్నారు. సత్యసాయిబాబా తల్లి ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో పుంగనూరు, చిత్తూరు, కుప్పం, బంగారుపాళ్యం, తడుకుపేటల్లో ఉచితంగా పిల్లలకు సత్యసాయి సేవాసంస్థ జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం ఆధ్వర్యంలో శిక్షణ సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ చైర్మన్‌గా సెల్వరాజ్ బాధ్యతల స్వీకారం

కుప్పం, మే 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా వి.సెల్వరాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో ఉదయం 8 గంటలకు పూజలు చేసి అక్కడి నుంచి ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం ఉదయం 9 నుంచి 10.30 గంటల మధ్య మున్సిపల్ కార్యాలయంలో సెల్వరాజ్ బాధ్యతలు స్వీకరిస్తారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

రావణ వాహనంపై మృత్యుంజయేశ్వరస్వామి విహారం


పురవీధుల్లో ఊరేగుతున్న మృత్యుంజయేశ్వరస్వామి దంపతులు

చౌడేపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఐదో రోజు రావణ బ్రహ్మ వాహనంపై ఆది దంపతులు ఊరేగారు. మంగళవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు, కుమార స్వామి, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి రావణ వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి ప్రత్యేకంగా పూలు, ప్రభలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. సజ్జన కులస్థుల మహిళలు స్వామివారికి దివ్వెలు, దీపాలు సమర్పించారు. మంగళ వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. గ్రామస్థులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా సజ్జన కులస్థులు వ్యవహరించారు. ఉభయదారులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రైతును రారాజు చేయాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం


రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతును రారాజు చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం శాంతిపురం వ్యవసాయ కార్యాలయంలో ప్రభుత్వం రాయితీపై రైతులకు అందిస్తున్న వ్యవసాయ పనిముట్లను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం సీజన్‌కు ముందే రైతులకు అవసరమైన పనిముట్లను సబ్సిడీపై అందివ్వడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, డ్రిప్ పరికరాలు, విత్తనాలు పూర్తి స్థాయిలో అందిస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ శాఖలో ఏదైనా సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, నేతలు విజయరామిరెడ్డి, చంద్ర, ఉదయ్, నాగరాజు, మణి, నారాయణ, యోగేంద్ర, అనసూయమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

పుంగనూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాగానిపల్లెకు చెందిన సుబ్బన్న భార్య మునెమ్మ (60) పుంగనూరు మారెమ్మగుడి వద్ద రోడ్డుపై నడచి వెళుతుండగా మంగళవారం ఓ ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వృద్ధురాలిని మదనపల్లెకు తరలించారు.

వేసవి శిక్షణ తరగతులకు స్పందన


వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

గంగవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కళామందిరంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులకు విశేష స్పందన లభిస్తోందని తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాధంనాయుడు, పుష్ప తెలిపారు. ఇప్పటికే 30 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు రోజూ ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు విద్యార్థులకు పద్యాలు, కథలు, ఆటపాటలు, మాట్లాడటం, నైతిక విలువలు తదితర వాటిపై తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు.

సంతలో సౌకర్యాలు కలేనా..!

● పరదాల మాటున వ్యాపారాలు ● చాలీచాలని స్థలంలో దుకాణాలు
● తాగునీరు, మరుగుదొడ్ల వసతి కరువు ● అవస్థలు పడుతున్న రైతులు, వ్యాపారులు



రొంపిచెర్ల వారపుసంతలో పరదాలు కట్టుకుని వ్యాపారాలు

రొంపిచెర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసే పంటలను అమ్ముకునేందుకు సంతలను ఆశ్రయిస్తుంటారు. వీరితో పాటు వ్యాపారులు సంతకొచ్చి సరకులు విక్రయిస్తుంటారు. కొనడానికి వివిధ ప్రాంతాల నుంచి వినియోగదారులు వస్తుంటారు. ఇలా సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్లాస్టిక్ పట్టలు కట్టుకుని ఎండావానకు అవస్థలు పడుతున్నారు. మండలంలోని రొంపిచెర్ల పంచాయతీ కార్యాలయం పక్కన, ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో , గానుగచింతకు వెళ్లే మార్గంలో ఇరువైపులా వారపు సంత దుకాణాలు పెడుతున్నారు. ఇక్కడ ప్రతి సోమవారం వారపుసంత నిర్వహిస్తారు. రొంపిచెర్ల మండలానికి ఒకే సంత జరుగుతోంది. రొంపిచెర్ల మండలంలోని వారే కాకుండా పులిచెర్ల, కల్లూరు, పీలేరు, ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు చుట్టుపక్కల రైతులతో పాటు వ్యాపారులు ఈ సంతకు వచ్చి కూరగాయలు, నిత్యావసర వస్తువులు విక్రయాలు చేస్తున్నారు. గ్రామానికి చుట్టుపక్కల చిల్లర వ్యాపారులు ఇక్కడకు వచ్చి తమకు అవసరమైన వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. అయితే సంతలో చాలీచాలని స్థలం, నీడ లేకపోవడంతో ప్లాస్టిక్ పట్టలను ఏర్పాటు చేసుకొని తాము తెచ్చిన కూరగాయలు, వస్తువులు విక్రయాలు చేసుకోవాల్సి వస్తుంది. పంచాయతీకి ఏటా రూ .6 లక్షలకు పైగా వేలంతో ఆదాయం సమకూరుతోంది. సంత ప్రాంగణంలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం శోచనీయం. సంతలో కనీసం మరుగుదొడ్లు, తాగునీటి వసతి లేక వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి సంతలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది.

సంతలో స్థలం చాలక అవస్థలు

రొంపిచెర్ల వారపు సంతకు కావాల్సిన స్థలం లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. అనువైన స్థలం ఉంటే వ్యాపారులు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న స్థలంలో ఇరుగ్గా దుకాణాలు పెడుతున్నారు. వ్యాపారాలు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉంది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి అవసరమైన మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.



- తులసీరాం, వంకాయల వ్యాపారి

సదుపాయాల కల్పనకు చర్యలు

పంచాయతీలోని వారపు సంతలో అసంపూర్తి మరుగుదొడ్ల పనులు, తాగునీటి వసతి కి చర్యలు తీసుకుంటాం. సంత స్థలంపై సర్పంచ్, స్థానికులతో చర్చించి మౌలిక వసతులు కల్పిస్తాం.



- మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం


పుంగనూరు: కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి డాక్టర్ సృజన

పుంగనూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత, నెలసరి రుతుస్రావంపై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి డాక్టర్ సృజన అన్నారు. మంగళవారం మండలంలోని మిట్టచింతలవారిపల్లె సచివాలయంలో గ్రామంలోని కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుస్రావం, పరిశుభ్రత, లైంగిక విద్య, ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. పుంగనూరు సీడీపీవో రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుగుణ, జ్యోత్స్న, ఏఎన్ఎం అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● సదుం: బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి సూచించారు. మండలంలోని రెడ్డివారిపల్లె సచివాలయంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని ఆమె ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో జరిగే బాల్య వివాహాల సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

● వి.కోట: కిశోర బాలికలు సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలరని ఐసీడీఎస్ సీడీపీవో అరుణ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


సదుం : బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మల్లీశ్వరి

కట్టమంచి చెరువు పూడికతీత పనులు వేగవంతం చేయండి

● మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి


చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్

చిత్తూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి చెరువులో జరుగుతున్న పూడికతీత, సుందరీకరణ పనులను వేగంగా చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి గాంధీ రోడ్డును పరిశీలించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఇతర నేతలు, ఇరిగేషన్‌అధికారులు పాల్గొన్నారు.

శ్రీదుర్గ కుటుంబీకులకు మంత్రి పరామర్శ

చిత్తూరు సిటీ: ఇటీవల మృతి చెందిన చిత్తూరు పార్లమెంటు తెలుగుమహిళ కార్యదర్శి శ్రీదుర్గ కుటుంబీకులను సంతపేటలోని వారి నివాసంలో మంగళవారం మంత్రి పరామర్శించారు. అపోలో వైద్యుల నిర్లక్ష్యంతోనే శ్రీదుర్గ మృతి చెందిందని, ఆ యాజమాన్యంతో కుదుర్చుకున్న ఎంవోయూను రద్దు చేయాలని మంత్రికి ఆమె తండ్రి టీడీపీ సీనియర్ నేత, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం వినతిపత్రం సమర్పించారు.

టీడీపీ సీనియర్ నేతకు అండగా నిలిచిన ఎంపీ

చిత్తూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండల సీనియర్ టీడీపీ నేత, మాజీ వైస్ ఎంపీపీ నీలకంఠనాయుడికి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు అండగా నిలిచారు. కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నీలకంఠనాయుడికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2.76 లక్షల చెక్కును మంగళవారం తన కార్యాలయంలో అందజేశారు. ఆయన కుటుంబీకులు ఎంపీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, టీడీపీ నాయకులు శోభన్‌బాబు, బిందు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యలను పరిష్కరించాలి

చిత్తూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల(సీహెచ్‌వో) సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సీహెచ్‌వోలు న్యాయమైన సమస్యలను పరిష్కరించడం కోసం ఆయా కలెక్టరేట్ల వద్ద తొమ్మిది రోజులుగా ఆందోళన చేస్తున్నా.. అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు నాగరాజు, నాయకులు మణి, బాలాజీరావు, కుమారి, సురేష్, దేవి తదితరులు పాల్గొన్నారు.

9న శ్రీకృష్ణ భజన మందిర మహా కుంభాభిషేకం

చిత్తూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని అలుకేరిపల్లె గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ భజన మందిర మహాకుంభాభిషేకం ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్తులు తెలిపారు.

గుడిపాలలో ప్రతి ఆర్టీసీ బస్సు ఆపేలా చూడండి

గుడిపాల, మే 6 (ఆంధ్రజ్యోతి): గుడిపాల, నరహరిపేటలో ప్రతి ఆర్టీసీ బస్సు ఆపేలా చూడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు మంగళవారం కోరారు. చిత్తూరులో వీరిని కలిసి సమస్యను వివరించగా, పరిష్కరిస్తామన్నారు.

14 నుంచి తిరుపతి గంగమాంబ జాతర


చాటింపు సందర్భంగా అంబళ్లు తీసుకొస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, మే 6 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరకు మంగళవారం చాటింపు వేశారు. ఈనెల 14వ తేదీన వినాయక స్వామి ఉత్సవంతో జాతర మహోత్సవాలు ప్రారంభమవుతాయి. 15న ముత్తుమారెమ్మ ఊరేగింపు, 16న ముత్తుమారెమ్మకు శేష వాహన సేవ, 17న సింహ వాహన సేవ, 18న అశ్వ వాహన సేవలు నిర్వహిస్తారు. 19న అమ్మవారి అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా ముత్తుమారెమ్మ అమ్మవారి కండ్ల తెర తొలగించి ప్రత్యేక పూజారాధన, ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారు అగ్నిగుండ ప్రవేశం చేస్తుంది. ఈ సందర్భంగా పుష్ప పల్లకి, గరిగె, సయ్యాండి, బాణాసంచా వేడుకలు వైభవంగా జరుగుతాయి. 20న ప్రసన్న తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి శిరస్సుకు ఉన్న తెర తొలగించి పట్టణంలో వీధివీధినా ఊరేగింపు చేస్తారు. చివరి రోజు 21వ తేదీన ప్రసన్న తిరుపతి అమ్మవారి విశ్వరూప సందర్శన ఉంటుంది. ఊరేగింపు తర్వాత తెల్లవారుజామున ఆలయానికి తీసుకొచ్చిన శిరస్సును, అప్పటికే గర్భాలయంలో ఉన్న మొండేనికి అమర్చడంతో అమ్మవారు విశ్వరూపంతో సాక్షాత్కరిస్తుంది. భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించుకుంటారు. ఆదేరోజు రాత్రి అమ్మవారి శిరస్సు నుంచి కళ్లు తొలగించి జలావాసం చేయడంతో కుప్పం గంగ జాతర మహోత్సవాలు ముగుస్తాయి. చివరి రెండు రోజుల్లో నిర్వహించే అమ్మవారి శిరస్సు ఊరేగింపు, విశ్వరూప సందర్శనలకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా కుప్పం పట్టణంతోపాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని గ్రామాలు స్థానికులతోపాటు బంధుమిత్రులతో కళకళలాడుతాయి.


హంస వాహనంపై కోనేటిరాయుడి ఊరేగింపు

తిరుచ్చి వాహనంపై కోనేటిరాయుడి తేజం

గంగవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధ ఆలయమైన కీలపట్ల కోనేటిరాయస్వామి మంగళవారం తిరుచ్చి, హంస వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. కీలపట్ల వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండోరోజు కోనేటిరాయస్వామి, అమ్మవార్లకు వివిధ అభిషేకాల అనంతరం ప్రత్యేక పూలతో అలంకరించారు. ఆలయం వద్ద అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. రాత్రి 7 గంటలకు హంస వాహనంపై కోనేటిరాయస్వామిని కొలువు దీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. కీలపట్ల, గంగవరం, పలమనేరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారి బ్రహ్మోత్సవాలలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, టీటీడీ అర్చకులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు ప్రారంభం


6పీజీఆర్‌కేఎల్ఆర్3: వాసవీమాత కలశ పూజ నిర్వహిస్తున్న గ్రామస్తులు

కల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు బజారువీధిలో కొలువైన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం వైభవోపేతంగా అమ్మవారి జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో వేదపారాయణం, గణపతి పూజ, గంగ స్వీకరణ, గోపూజ, రక్షాబంధనం, చండీపారాయణం, కుంకుమార్చన, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

భగవద్గీతను అందరూ చదవండి

ఐరాల, మే 6 (ఆంధ్రజ్యోతి): భగవద్గీతను అందరూ చదవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి అన్నారు. మంగళవారం అగరంపల్లె, తిరువణంపల్లె, ఎం.కొత్తూరు, గాజులపల్లె, చిగరపల్లె, 45కొత్తపల్లె, ఈతమాకులపల్లె, ముదిగోళం, మద్దిపట్లపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. సభ్యులు హేమంత్, రాజేంద్రన్, వింధ్య, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ వ్రతం


అలంకరణలో అమ్మవారు

పుంగనూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు బజారువీధిలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో ఆర్యవైశ్యులు వాసవీవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు మంజునాథ దీక్షితులు శాస్త్రోక్తంగా అమ్మవారికి అభిషేకం, అర్చన, పూజలు నిర్వహించి ముత్యాల చీర అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి దర్పణ పూజ చేశారు. కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కె.బాలసుబ్రహ్మణ్యం, శ్రీరామసప్తాహ కమిటీ, ఆర్యవైశ్యులు, ఉభయదారులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేతకు అండగా నిలిచిన ఎంపీ



నీలకంఠనాయుడికి చెక్కు అందజేస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండల సీనియర్ టీడీపీ నేత, మాజీ వైస్ ఎంపీపీ నీలకంఠనాయుడికి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు అండగా నిలిచారు. కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నీలకంఠనాయుడికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2.76 లక్షల చెక్కును మంగళవారం తన కార్యాలయంలో అందజేశారు. ఆయన కుటుంబీకులు ఈ సందర్భంగా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, టీడీపీ నాయకులు శోభన్‌బాబు, బిందు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యలను పరిష్కరించాలి: ఏఐటీయూసీ



ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల(సీహెచ్‌వో) సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సీహెచ్‌వోలు న్యాయమైన సమస్యలను పరిష్కరించడం కోసం ఆయా కలెక్టరేట్ల వద్ద తొమ్మిది రోజులుగా ఆందోళన చేస్తున్నా.. అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు నాగరాజు, నాయకులు మణి, బాలాజీ రావు, కుమారి, సురేష్, దేవి తదితరులు పాల్గొన్నారు.

గంగజాతరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



బజారువీధిలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంహెచ్‌వో లోకేష్

చిత్తూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంగజాతర సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ ఆదేశించారు. గంగమ్మను ప్రతిష్ఠించే ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రధానంగా నడివీధి గంగమ్మను ప్రతిష్ఠించే బజారువీధితోపాటు అమ్మవారిని కొలువుదీర్చే ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలకు సూచించారు. అలాగే నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్న చర్చివీధి, బజారువీధి ప్రాంతాల్లోని దుకాణాలపై దాడులు చేశారు. వస్తువులను సీజ్ చేసి ఆరు దుకాణదారులకు రూ.18వేల అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్‌లో మార్పులు చేయాలి



కమిషనర్ నరసింహ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న లైసెన్స్‌డ్ ఇంజనీర్లు

చిత్తూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్-2025లో కొద్దిపాటి మార్పులు చేసి.. ప్రజలకు మరింత చేరువ చేయాలని చిత్తూరు అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ నేతలు కోరారు. మంగళవారం ఈ మేరకు కమిషనర్ నరసింహప్రసాద్, ఏసీపీ నాగేంద్రలను కలిసి వినతిపత్రాన్ని అందించారు. సంఘ అధ్యక్షుడు జయప్రకాష్, నేతలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస బాలాజీ, విజయశేఖర్, గుణశేఖర్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి: ఆశా వర్కర్లు

నగరి, మే 6 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపుతో నగరిలో మంగళవారం సత్రవాడ, కొత్తపేట ఆరోగ్య కేంద్రాల్లోని అధికారులకు వినతిపత్రం అందించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు ఉషారాణి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ ఇవ్వడంతోపాటు వయోపరిమితి 62 ఏళ్లకు పెంపు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీల తీరుపై ఆరోగ్య సిబ్బంది నిరసన



కార్వేటినగరం మండలం కత్తెరపల్లెలో ఆరోగ్య సిబ్బంది నిరసన

వెదురుకుప్పం, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు సాటి సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఆరోగ్య సిబ్బంది నిరసించారు. రాష్ట్రవ్యాప్త పిలుపుతో మంగళవారం కార్వేటినగరం మండలం కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు.

శ్రీరంగరాజపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట కూడా నల్లబ్యాడ్జీలు ధరించి హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది నిరసన తెలిపారు.

భగవద్గీతను అందరూ చదవండి

ఐరాల, మే 6 (ఆంధ్రజ్యోతి): భగవద్గీతను అందరూ చదవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి అన్నారు. మంగళవారం అగరంపల్లె, తిరువణంపల్లె, ఎం.కొత్తూరు, గాజులపల్లె, చిగరపల్లె, 45కొత్తపల్లె, ఈతమాకులపల్లె, ముదిగోళం, మద్దిపట్లపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. సభ్యులు హేమంత్, రాజేంద్రన్, వింధ్య, రేఖ తదితరులు పాల్గొన్నారు.

9న శ్రీకృష్ణ భజన మందిర మహా కుంభాభిషేకం

చిత్తూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని అలుకేరిపల్లె గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ భజన మందిర మహాకుంభాభిషేకం ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్థులు తెలిపారు.

గుడిపాలలో ప్రతి ఆర్టీసీ బస్సు ఆపేలా చూడండి



రామ్‌ప్రసాద్‌రెడ్డితో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యంనాయుడు

గుడిపాల, మే 6 (ఆంధ్రజ్యోతి): గుడిపాల, నరహరిపేటలో ప్రతి ఆర్టీసీ బస్సు ఆపేలా చూడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని, ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్‌ని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు మంగళవారం కోరారు. చిత్తూరులో వీరిని కలిసి సమస్యను వివరించగా, పరిష్కరిస్తామన్నారు.

గాలివాన బీభత్సం

పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

బంగారుపాళ్యం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిమానుపెంట పంచాయతీ మొగిలీశ్వరపాళ్యంలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సానికి ఐదు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు కొంత అంతరాయం ఏర్పడింది. ఏఈ దేవీ ప్రసన్న ఆదేశాలతో లైన్‌మెన్ రత్నమాచారి సంఘటనా స్థలానికి చేరుకుని తమ సిబ్బందితో కలిసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వెదురుకుప్పం: మండలంలోనూ సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. కార్వేటినగరం మండలంలోనూ గాలివాన బీభత్సం సృష్టించింది. చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై చెట్టు కూలడంతో పోలీసులు తొలగించాల్సి వచ్చింది.

శ్రీరంగరాజపురం: మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన కురిసింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నగరి: పట్టణ పరిధిలో మంగళవారం సాయంత్రం ఆరు గంటల నుంచి పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్‌కు అంతరాయం తలెత్తింది. రాత్రి 9.45 గంటలకు విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. ఉదయం నుంచి సుమారు 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో స్థానికులు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడ్డారు.



నగరిలో కురుస్తున్న వాన

సాయంత్రానికి గాలులతో కూడిన వర్షం కురవడంతో జనం ఉపశమనం పొందారు. అయితే పల్లెల్లో నూర్పిడికి వచ్చిన వరిపంట దెబ్బతినే అవకాశం ఉందని రైతులు వాపోయారు.

కట్టమంచి చెరువు పూడికతీత పనులు వేగంగా చేయండి

- మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి



చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి చెరువులో జరుగుతున్న పూడికతీత, సుందరీకరణ పనులను వేగంగా చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి గాంధీ రోడ్డును పరిశీలించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఇతర నేతలు, ఇరిగేషన్‌అధికారులు పాల్గొన్నారు.

శ్రీదుర్గ కుటుంబీకులకు మంత్రి పరామర్శ

చిత్తూరు సిటీ: ఇటీవల మృతి చెందిన చిత్తూరు పార్లమెంటు తెలుగుమహిళ కార్యదర్శి శ్రీదుర్గ కుటుంబీకులను సంతపేటలోని వారి నివాసంలో మంగళవారం మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా అపోలో వైద్యుల నిర్లక్ష్యంతోనే శ్రీదుర్గ మృతి చెందిందని, ఆ యాజమాన్యంతో కుదుర్చుకున్న ఎంవోయూను రద్దు చేయాలని మంత్రికి ఆమె తండ్రి టీడీపీ సీనియర్ నేత, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం వినతిపత్రం సమర్పించారు.

వైభవంగా గంగ జాతర



రాచపాళ్యం, ఆర్‌ఆర్‌నగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పాలసముద్రం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపాళ్యం, రాచపాళ్యం ఆదిఆంధ్రవాడ గ్రామాల్లో గంగ జాతరను స్థానికులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబళ్లు పోసి, గెరిగను ఊరేగించారు. సాయంత్రం గ్రామదేవత ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ప్రదర్శించిన వీధి నాటకం అలరించింది.

బంగారుపాళ్యం: తగ్గువారిపల్లె పంచాయతీ ఆర్‌ఆర్ నగర్‌లో మంగళవారం గంగజాతరను వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా, మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు జయచంద్రారెడ్డి, రవి, భానుప్రకాష్, జయశంకర్, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా యాదమరి గంగ జాతర



గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, మే 6 (ఆంధ్రజ్యోతి): యాదమరి గంగమ్మ జాతర వేడుకగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు విశ్వరూప దర్శనం కల్పించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జనంతో జాతర ముగియనుంది. యాదమరి పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు.

నగరిలో టీడీపీ సంస్థాగత ఎన్నికలు



ఎం.కొత్తూరులో జరిగిన ఎన్నికల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

నగరి, మే 6 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ, మండల పరిధిలో టీడీపీ సంస్థాగత ఎన్నికలను పరిశీలకులు రమేష్‌రాజు, షణ్ముగరెడ్డి, గణేష్ మొదలియార్ మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని 3, 4, 5, 25 వార్డుల్లో, మండలంలోని ఎం.కొత్తూరు, దేశూరు. అగరం, నంబాకం గ్రామాల్లో ఎన్నికలు జరిగాయి. గ్రామ, వార్డు కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ట్యాక్సీ డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలి: సీపీఐ



చెక్‌పోస్టు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నగరి, మే 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు చెక్‌పోస్టుల వద్ద మన రాష్ట్రం నుంచి వెళ్లే ట్యాక్సీ డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని నగరి సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చెక్‌పోస్టు వద్ద డ్రైవర్లతో కలిసి నిరసన తెలిపారు. నగరి నుంచి తరచూ తమిళనాడుకు ట్యాక్సీలు వెళుతుంటాయని, రికార్డులున్నా వాహనం వెనుకవైపునుంచి నెంబర్‌ప్లేట్‌ను ఫొటో తీసి ఫైన్ వేస్తున్నారని సీపీఐ నాయకులు వేలన్, బాషా ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఆంజనేయుడి ఆలయాభివృద్ధికి సహకరిస్తా: ఎమ్మెల్యే



ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, మే 6 (ఆంధ్రజ్యోతి): పాళ్యంకొండ ఆంజనేయస్వామి ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ అన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, ఉపాధ్యక్షుడు మోహన్, సభ్యులు ఎమ్మెల్యేని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆలయ సమస్యలను ప్రస్తావించగా, దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వసంతాపురంలో బుధవారం జరగనున్న ద్రౌపది కల్యాణోత్సవానికి విచ్చేయాలని ఎమ్మెల్యేను మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, మహాభారత కమిటీ సభ్యులు కోరారు. జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులనాయుడు, టీడీపీ నాయకులు హేమాద్రినాయుడు, దక్షిణామూర్తి, మధుసూదన్‌నాయుడు, భారతం కమిటీ సభ్యులు కన్నయ్యనాయుడు, రెడ్డెప్ప, కేశవపిళ్ళై, శివ, రామ్మూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నా స్థలం కబ్జా చేసి.. నాపైనే ఆరోపణలా?

- టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి

విజయపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): 'నగరి మున్సిపాలిటీ జ్యోతినగర్‌లోని నా స్థలాన్ని మాజీ మంత్రి రోజా భర్త, వాళ్ల సోదరుడి అండదండలతో మీనా కుమార్ కబ్జా చేశారు. ఇపుడు వైసీపీవారు నాపైనే ఆరోపణలు చేస్తున్నారు' అని టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన స్వగ్రామం కళియంబాకంలో మీడియాకు వివరాలు తెలిపారు. 'మీనాకుమార్‌కు చెందిన స్థలం హైవేలో పోగా, దానికి ప్రభుత్వం పరిహారం కూడా కట్టించింది. అయినా పక్కనే ఉన్న నా స్థలాన్ని కబ్జా చేయడంతో తహసీల్దార్, ఆర్డీవోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో ప్రస్తుత నగరి మున్సిపల్ చైర్మన్ రూ.40లక్షలు ఇవ్వాలని అప్పట్లో బేరం మాట్లాడి, ఇప్పుడు తప్పుడు ప్రకటన చేస్తున్నారు. దీనిపై కాణిపాకంలో సత్యప్రమాణానికి రావాలి' అని గుణశేఖర్‌రెడ్డి కోరారు. అధికారులు న్యాయం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



వెదురుకుప్పం, మే 6 (ఆంధ్రజ్యోతి): పాతగుంట సమీపంలో ఓ యువకుడు(25) బైక్‌లో వెళ్తూ అదుపుతప్పి పడటంతో గాయలయ్యాయని స్థానికులు మంగళవారం తెలిపారు. బాధితుడిని 108 అంబులెన్స్ ద్వారా తిరుపతికి తరలించారు. వ్యక్తిగత వివరాలు తెలియరాలేదు. వెదురుకుప్పం పోలీసులకు కూడా ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన చిన్నారులు

చిత్తూరు కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గత నెల 27వ తేదీనుంచి చిన్నారులకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక అంశాలపై నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. నగరంలోని గిరింపేట సత్యసాయి సంస్థాన్, కొంగారెడ్డిపల్లె ఉషానగర్ కాలనీ సత్యసాయి బాలవికాస్, సంతపేట పేట గాండ్లవీధి బాలవికాస్ కేంద్రాల్లో 6-12 ఏళ్ల చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ఆయా కేంద్రాల నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్‌నాయుడు, పాండురంగం, గజేంద్రరెడ్డి, శ్రీకంఠయ్య, శేషనారాయణ, సత్యనారాయణ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు టీడీపీ అధ్యక్ష పదవికి పోటీ ఎక్కువే..!

గంగాధరనెల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల టీడీపీ అధ్యక్ష పదవికి పోటీ ఎక్కువగా ఉంది. రేసులో పలువురు నాయకులు ఉన్నారు. కమ్మ సామాజిక వర్గంలో.. వరత్తూరు పంచాయతీ ఒగ్గువారిపల్లెకు చెందిన జిల్లా తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు, రెడ్ల సామాజిక వర్గంలో.. పాపిరెడ్డిపల్లె పంచాయతీ తిమ్మిరెడ్డిపల్లెకు చెందిన సింగిల్‌విండో సొసైటీ మాజీ డైరెక్టర్ కామసాని విజయకుమార్‌రెడ్డి, పాపిరెడ్డిపల్లెకు చెందిన రైల్వే కాంట్రాక్టర్ పోలు రుషేంద్రరెడ్డి, కోటాగరం పంచాయతీ ఎట్టేరికి చెందిన పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, బీసీ సామాజిక వర్గంలో.. నెల్లేపల్లె పంచాయతీ నెల్లేపల్లె మిట్టకు చెందిన పెనుమూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్‌యాదవ్, కొండేపల్లె పంచాయతీ కొండేపల్లెకు చెందిన మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి మునిరాజులు యాదవ్, పెద్దకాల్వ పంచాయతీ పెద్దకాల్వకు చెందిన లాయర్ శరవణకుమార్, ముస్లిం మైనారిటీ సామాజికవర్గంలో.. తూగుండ్రం పంచాయతీ ఆవలకొండకు చెందిన నియోజకవర్గ ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి, తూగుండ్రం మాజీ సర్పంచ్ షేక్ నియాజ్ అలీ, దళిత సామాజిక వర్గంలో.. గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు దేవసుందరం, ఆత్మకూరు పంచాయతీ రాశిమిరెడ్డిపల్లె దళితవాడకు చెందిన ప్రస్తుతం మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న బి.స్వామిదాస్ పోటీపడుతున్నారు. ఎక్కువసార్లు దళిత వర్గానికి చెందినవారే అధ్యక్ష పదవిలో ఉన్నారని.. ఈదఫా వేరే వర్గానికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్‌ను నాయకులు వేర్వేరుగా కలిసి తమకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఎవరికి అవకాశం దక్కుతుందోనన్న చర్చ ప్రస్తుతం మండలంలో నడుస్తోంది.

అమాసకు సన్మానం



గంగాధరనెల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీసీసీబీ చైర్మన్ పదవికి ఎంపికైన అమాస రాజశేఖర్‌రెడ్డిని తిరుపతిలోని స్వగృహంలో మంగళవారం పలువురు సన్మానించారు. జిల్లా సింగిల్‌విండో సొసైటీల ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు, గంగాధరనెల్లూరుకు చెందిన విజయకుమార్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రమేష్, గౌరవాధ్యక్షుడు తులసిపిళ్ళై, ఉపాధ్యక్షులు దిలీప్ రామ్మూర్తి, శ్రీధర్, శివారెడ్డి, ట్రెజరర్ పట్టాభి, జాయింట్ కార్యదర్శులు వెంకటముని, వెంకటరమణ, సీతపోలు రామ్మూర్తి, ఖలీల్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

27, 28 తేదీల్లో పాలేటమ్మ గంగ జాతర

ఐరాల, మే 6 (ఆంధ్రజ్యోతి): గార్గేయినదీ తీరాన వెలసి ఉన్న పాలేటమ్మ గంగ జాతరను ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంకే బాలాజీ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 19న సాయంత్రం పాలేటమ్మకు అభిషేకం, రాత్రి గెరిగ పూజ చేస్తామన్నారు. 27న గంగమ్మ శిరస్సు ప్రతిష్ఠ ఉంటుందని పేర్కొన్నారు. 28న రాత్రి ఏడు గంటలకు గంగమ్మను ఐరాలపురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేస్తామని వివరించారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

పెనుమూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): జట్టిగుండ్లపల్లెలో మహాభారత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం బలిబండి ద్వారా ప్రసాదాలు, దున్నపోతు బలి ఇవ్వడానికి గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. సుదర్శన్‌నాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రుడి ఆరాధనోత్సవాలు

బంగారుపాళ్యం, మే 6 (ఆంధ్రజ్యోతి): తగ్గువారిపల్లెలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా సునీత



ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న సునీత, సౌందర్‌రాజు

యాదమరి, మే 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీలో యాదమరి మండలానికి చెందిన సునీతకు చోటు దక్కింది. టీడీపీ నాయకుడు సౌందర్‌రాజు భార్య అయిన ఈమె ఫిజియోథెరపీ వైద్యురాలు. సామాజిక కార్యక్రమాలు, టీడీపీ పార్టీ బలోపేతానికి ఆమె అందించిన సేవలను గుర్తించిన ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు లేఖ రాశారు. దీంతో అడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా నియమిస్తూ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఎంపీని మంగళవారం ఆయన కార్యాలయంలో సునీత దంపతులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన యోగా శిక్షణ

చిత్తూరు కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో పది రోజులుగా బాలలకు సిద్ధ సమాధి యోగా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. యోగా గురువులు నరేంద్రకుమార్, బ్రహ్మయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి, జగన్నాథ్, బాలల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

9నుంచి లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

వెదురుకుప్పం, మే 6 (ఆంధ్రజ్యోతి): చిన్న మరెడ్డికండ్రిగలోని లక్ష్మీనరసింహ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల తొమ్మిది నుంచి 11వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త మిట్టపల్లి మంజుల, ప్రధాన కార్యనిర్వాహకుడు మిట్టపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి మంగళవారం తెలిపారు. ప్రత్యేక పూజలు, భజనలు, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

వెదురుకుప్పం, మే 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వళ్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గ్రామ దేవత బంగారమ్మకు కూడా పూజలు నిర్వహించారు.

బాలికల ఆరోగ్యంపై అవగాహన

నగరి, మే 6 (ఆంధ్రజ్యోతి): బాలికల ఆరోగ్యంపై నగరి పట్టణంలోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్ శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని చిప్పారపల్లె ఎంపీపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ట్రైనర్ అఫ్రీన్, అంగన్వాడీ కార్యకర్త నీరజ, సెక్రటరీ జ్యోతీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని కేవీపురం అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో కృష్ణవేణి, అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.